www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

వాచస్పతి ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం  ADIKAVI NANNAYA UNIVERSITY

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :32 | 24-05-2021 | పుటలు : 4

# జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం

## జీవ వైవిధ్యం (బయో డైవర్సిటీ)





మానవజాతికి ప్రకృతి అనేక వరాలను ప్రసాదించింది. ప్రకృతితో సహజీవనం చేస్తున్నప్పుడు నాగరికత కలకాలం వర్ధిల్లుతుంది కానీ నాగరికత అభివృద్ధి ముసుగులో సహజ వనరుల దుర్వినియోగం పెరిగిపోతే మానవ మనుగడకే ముప్పు తప్పదు. భూమి, నీరు,గాలి, ఆకాశం.. వీటితో కూడిన ప్రకృతి ఏదైతే ఉందో అది భౌతిక పర్యావరణం. ఆ పర్యావరణాన్ని "మరణం" కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత పూర్తిగా మానవునిదే.

సూడాన్ ఎడారుల్లో చిన్నపిల్లలు ఆకలికి తాళలేక మట్టిలోని చీమల్ని ఏరుకుని తిరుగుతున్నారట... ప్రకృతి చెబుతోంది కరువు తెచ్చానని! మిడిల్ ఈస్ట్ మూలాల్లో నేల నెర్రలు తీసి ఒక్క మొక్క బతకడం లేదట.... ప్రకృతి చెపుతోంది తనకు కోపం వచ్చిందని! ఇండియా, బంగ్లాదేశ్,స్పెయిన్ లాంటి దేశాలు ఏటా వరదలతో అల్లాడిపోతున్నాయి ప్రకృతి అంటోంది... తగిన శాస్తి తనవల్లేనని! రాత్రికి రాత్రి కురిసిన వానతో మొజాంబిక్ లోని చిన్నచిన్న ఊళ్ళు కనుమరుగయ్యాయట... ప్రకృతి చెప్తోంది ఇక తనను ఎవరూ ఆపలేరని! భూగోళం మీద అన్ని ఎడారులు ఇసుక తుఫానులతో చెలరేగి పోతున్నాయి.... ప్రకృతి చెబుతోంది నిర్లక్ష్యం చేస్తున్న మనిషిపై ప్రతీకారమని! ఫ్రెంచ్ పోలేన్సియాలో మంచు కొండలు కరిగిపోతున్నాయట, ఎంతగా అంటే సముద్రమట్టానికి సమాంతరంగా వచ్చేలా! స్పెయిన్ లో కాలుష్యం కమ్ముకుని వ్యాధులను చిలకరిస్తున్నాయట... మెక్సికో సముద్రతీరంలో ఆయిల్ తెట్టు జలచరాలను మింగేస్తున్నా... నెర్రలు తీసిన థాయిలాండ్ మూల నేలల్లోని జనం నత్త గుల్లల్ని ఏరుకుని తినాల్సి వస్తున్నా, బ్రెజిల్లో సముద్రమట్టం మారుతున్నా, నదీజలాల కారణంగా అడవులు కనుమరుగవుతున్నా, అడవులు తగలబడి పోతున్నా... అన్నింటికీ ప్రకృతి నుంచి ఒకటే సమాధానం.... జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తూ సర్వ ప్రాణికోటికి హానిచేస్తున్న మనిషి నిర్లక్ష్యాన్ని చూసి కోపం వచ్చిందని!! పర్యావరణ సమతుల్యతను పాతేస్తున్న ప్రాణుల్ని క్షమించేది లేదని!!!

*ఇదీ ప్రకృతి చేస్తున్న వికృత హేష మీద నేటి పత్రికల ఘోష!!!*



## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు






వెబినార్ లో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**22.05.21 (మీడియాసెల్)** జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ భావితరాలకు స్థిరమైన అభివృద్ధిని అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బయోడైవర్సిటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని "సస్టైనబుల్ ఫుడ్స్ ఫర్ హెల్తీ పీపుల్ అండ్ హెల్తీ ప్లానెట్" అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. బి.కెజియారాణి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు. భూమిపై కొన్ని లక్షల జీవరాశులు జీవిస్తున్నాయని వాటి ద్వారా భూమికి ఎటువంటి నష్టమూ జరగడం లేదని కేవలం మానవ క్రియల ద్వారానే జీవవైవిధ్యం దెబ్బతింటుందని తెలిపారు. అభివృద్ధి పేరుతో మానవుడు చేసే ప్రయత్నాలు ప్రకృతికి విరుద్ధంగా ఉన్నాయని తద్వారా అనేక విధ్వంసాలను, ఉపద్రవాలను జీవరాశులు ఎదుర్కోవలసి వస్తుందని గుర్తు చేసారు. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ స్థిరమైన అభివృద్ధిని సాధించ గలిగితే భావితరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. తర్వాత ఇంటర్నేషనల్ హ్యూమన్ సొసైటీ ఇండియన్ క్యాంపెయినర్ వై.ప్రదీప్ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్ల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏ విధంగా రూపొందించాలనే దానిపై వివరించారు. జీవ వైవిధ్యానికి సంబంధించి ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పరిశోధనలు అధ్యయనాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. బి. కెజియారాణి, స్పృహ అలుమ్ని ఆసోసియేషన్ సుంకర నాగేంద్ర కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆన్లైన్ లో అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ రెడ్డి "జీవవైవిధ్య అంచనా మరియు పరిరక్షణ" అనే అంశంపై ప్రసంగించారు. జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాలని భావితరాలకు వాటిని అందజేయాలని ఆయన తెలిపారు. జీవవైవిధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న విశ్వవిద్యాలయ వీ.సీ.జగన్నాథరావు గారికి మరియు అధికారులకు సదస్సు నిర్వహణ కర్త డా. పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.



## సంపాదకీయం



# నిర్భయం

ధైర్యంగా ఉండండి. ప్రతి అంశానికి పరిష్కారం ఉంది. ప్రస్తుతం సమాజంలో కరోనా కన్నా భయం ఎక్కువగా ఆవరించి ఉంది. చిన్న పెద్ద తేడా లేకుండా ఇది అందరినీ ఆవహించి ఉంది. కొంత మంది చీకటికి భయపడతారు. అభద్రతా భావం, ఆందోళన వలన భయం పుడుతుంది. సమాజంలో మనం మనగలుగుతామా అనే భయం. భయం అనేది ఆందోళన చెందడం వల్ల మనసులో మొదలవుతుంది. గత పద్నాలుగు మాసాల నుండి భయం ఆవరించి ఉంది. కరోనా మనల్ని అంతగా భయపెడుతుంది. మామూలు వైరస్ కన్నా మెంటల్ వైరస్ ప్రమాదకరమైంది. మనిషిని లొంగదీసి క్రుంగదీసేది భయమే. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత ఎదిగినా ఆధునిక మానవుడు భయానికి పరిష్కారాన్ని కనిపెట్టలేక పోతున్నాడు. ఎందుకంటే భయం ఆంతరికమైంది. అది మనిషిలో ఉంది. బయట లేదు. ఒత్తిడికి కారణం కూడా ఇదే." విరాగేన అభయం" అన్నారు భర్తృహరి అనే కవి. వైరాగ్యాన్ని కలిగి ఉండటమే నిర్భయం అని అర్థం. ధార్మికమైన బలం మనిషికి చాలా అవసరం. భయం చేతిలో ఓడిపోతే మనం తప్పులు చేయటం మొదలు పెడతాం. జాగ్రత్త, ఏకాగ్రత భయం నుంచి బయటపడవేసే ప్రాథమిక అంశాలు. ఎంత ఎక్కువ భయపడితే మనిషి అంత పిరికివానిగా మారిపోతాడు. భయం ఒక కల్పన. చీకటి, ఆలోచనలు, భవిష్యత్ గురించి ఆందోళన కూడా భయానికి కారణాలు. ఒకరికి భయం అనుకున్నది కొన్ని సందర్భాలలో మరొకరికి భయం కాకపోవచ్చు. భయం కన్నా భయం అనే ఆలోచనే మనల్ని కృంగదీస్తుంది. మనసే భయం అనే విషాన్ని సృష్టిస్తుంది. మనసే ధైర్యం అనే అమృతాన్ని సృష్టిస్తుంది. వెలుగు ఉన్న చోట నీడ ఉంటుంది. దూరంగా ఉన్నప్పుడు నీడ పెద్దగా ఉంటుంది వెలుగుకు దగ్గరగా వెళితే నీడ కనిపించదు. అంతా వెలుగే. నిర్భయత్వానికి దగ్గరగా వెళ్లాలి. అంతే!! ధైర్యంగా ఉన్నప్పుడే చాలా వాటిని మనం ఎదుర్కోగలం. నిర్భయత్వమే జీవనం!!

# వెళ్లేలోగా ఖాళీ అయిపోదాం!

* Die Empty*

## పుస్తకం



'పెద్ద నీతితో కూడిన ఈ చిన్నపుస్తకాన్ని టాడ్ హెన్రీ (Todd Henry) రాశారు.

'ఈ పుస్తకం రాయడానికి ఓ ప్రేరణ వుంది.

'టాడ్ హెన్రీ ఒక వ్యాపారపరమైన సమావేశంలో పాల్గొంటున్నప్పుడు వాళ్ళ డైరెక్టర్ ఒక ప్రశ్నవేస్తాడు.'

'ఈ ప్రపంచం మొత్తంలో అత్యంత ఖరీదైన భూమి ఎక్కడ వుంది?' అనేది ఆ ప్రశ్న.

'గల్ఫ్ దేశాలు అని ఒకరు, వజ్రాల గనులు ఉన్న ఆఫ్రికా' అని మరొకరు ఇలా జవాబులు చెబుతారు.


అప్పుడా డైరెక్టర్ అందర్నీ ఆశ్చర్యచకితులను చేసే సమాధానం చెబుతాడు.

'ఈ లోకంలో అతి ఖరీదైన స్థలం స్మశానం!'

'ఎందుకంటే...

అంటూ ఆయనే వివరణ ఇస్తాడు.

'ఈ ప్రపంచంలో అనాదిగా కోటానుకోట్లమంది పుట్టారు, మరణించారు. ఇంకా పుడుతూనే వున్నారు, ఇంకా చనిపోతూనే వున్నారు. పుట్టిన వారిలో చాలా కొద్దిమంది మాత్రమే తమలోని తెలివితేటలను ప్రపంచానికి పంచారు. కానీ అధికసంఖ్యాకులు మాత్రం తమలో నిగూఢంగా వున్న మేధస్సును, అనేక ఆలోచనలను, అద్భుతమైన ఐడియాలను తమలోనే దాచుకుని ఈ లోకాన్ని దాటిపోయారు. అవేవీ వెలుగు చూడలేదు. వాటివల్ల ఈ ప్రపంచానికి దక్కాల్సిన ప్రయోజనమూ దక్కకుండా పోయింది. అవన్నీ సమాధుల్లోనే నిక్షిప్తం అయిపోయాయి.




అంతటి విలువైన సంపదను దాచుకున్న స్మశానం కంటే విలువైన భూమి ఇంకెక్కడ వుంటుంది చెప్పండి?'

డైరెక్టర్ చెప్పిన మాటలు టాడ్ హెన్రీ మనస్సులో గట్టిగా నాటుకుని పోయాయి.

ఆ ప్రేరణతోనే టాడ్ హెన్రీ "Die empty" అనే పుస్తకం రాసి అద్భుతమైన రచయితగా పేరు పొందాడు.

ఆయన ఈ పుస్తకంలో అంటాడు ఇలా ఒకచోట...

'మీరు మీలోని సృజనాత్మకతను మీలోనే దాచుకుని సమాధుల్లో శాశ్వతంగా నిద్రించడానికి వెళ్ళకండి.లి లిఅవేవో ఈ ప్రపంచానికి పంచేసి వెళ్ళండి!'

నిజానికి టాడ్ హెన్రీ చెప్పదలచుకున్నది ఏమిటంటే...

'మీలోని మంచిని మీరు ఈ లోకాన్ని వీడేలోగా ప్రపంచానికి పంచేసి వెళ్ళండి. ' మీ దగ్గర మంచి ఆలోచన వుంటే చనిపోయేలోగా దాన్ని ఆచరణలో పెట్టండి.

'మీలోని జ్ఞానాన్ని నలుగురికీ పంచండి.'మీకేదైనా లక్ష్యం వుంటే చనిపోయేలోగా దాన్ని సాధించండి.

'ప్రేమను పంచండి, మీలోనే దాచుకుని వృధా చేయకండి'


వున్నది నలుగురికీ పంచడం ఈనాటి నుండే మొదలు పెడదాం. మన మంచితనంలోఉన్న ప్రతి అణువునూ అందరికీ ఇచ్చేద్దాం!*

'అప్పుడు హాయిగా ...ప్రశాంతంగా....

"Let us Die Empty!"


**- డాక్టర్ డి.కళ్యాణి.**

# "వికలాంగుల పునరావాసంపై పరిశోధన"




**23.05.21 (మీడియాసెల్)** సైకాలజీ వెబినార్‌లో 80 మంది స్పెషల్ ఎడ్యుకేటర్స్, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు విషయ పరిజ్ఞాన పెంపుదలతో పాటు వికలాంగులకు మానవతాదృక్పథంతో సేవలు అందించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. నన్నయ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి. హెచ్. మణిరమణ చీఫ్ కన్వీనర్‌గా రెండు రోజుల జాతీయ వెబినార్లో, క్వాలిటేటివ్ రీసెర్చ్ ఆధారిత ఫోకస్ గ్రూప్ చర్చ గురించి సోదాహరణగా వివరించిన స్పృహ సైకాలజీ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిషోర్, డా.మణి రమణలు స్పెషల్ ఎడ్యుకేటర్లతో జరిపిన ఫోకస్ గ్రూప్ చర్చలో 1. వికలాంగులకు వాక్సిన్ ఆందిచాలని, 2. ప్రతి జిల్లాలో కరోనా సోకిన వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, సంస్థలుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. వీసీ గారు తన మద్దతును తెలియజేశారు. వికలాంగుల పునరావాసంపై పరిశోధన వెబినార్‌కు చైర్ పర్సన్స్‌గా స్పృహ సైకాలజిస్ట్‌లు ఎస్.రాజేష్ ఖన్నా, ఎస్. నాగేంద్ర కిషోర్లు వ్యవహరించారు. అందరినీ అలరించిన ఈ వెబినార్లో మిగతా ప్రత్తిపాదనలను విశ్వవిద్యాలయం ద్వారా త్వరలో ఆందరికీ ఆందజేస్తామని తెలియచేశారు. రెండురోజుల జాతీయ వెబినార్‌కి ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు, ముఖ్యవక్తగా నిప్ మెడీ డైరెక్టర్ నాచికేత రౌత్, డాక్టర్ కామరాజు, ఠాకూర్ హరీష్. రేవతి, నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్,ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సైకాలజీ అధ్యాపకులు డా. పడాల రాజశేఖర్, డా. కృష్ణ భవాని, డా.నారాయణ నక్కినలు, వివిధ రిసోర్సుర్సన్స్ పాల్గొన్నారు.

## మంచి మాట



**యస్య జ్ఞాన మయం తపః**

**జ్ఞాన సంపదను సంపాదించడమే తపస్సు.**

**ఎవరికి జ్ఞానసంపద కలదో అదే తపస్సు అని అర్థం!!**




## ప్రతిభా వాణి

# వంశీ



వంశీ పూర్తి పేరు నల్లమిల్లి వంశీ. తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో పుట్టి 1975 దాకా ఆ ఊరికి 15 మైళ్ల దూరంలో ఉన్న పసలపూడిలో పెరిగారు. తర్వాత మద్రాసు వెళ్లి మొట్టమొదట విక్టరీ మధుసూదనరావు గారి దగ్గర ఎన్టీ రామారావు గారు నటించిన ఎదురీత సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ గా చేరారు. ఒకపక్క అసిస్టెంట్ గా చేస్తూనే కథలు నవలలే కాకుండా రేడియోకి చంద్రకాంత శిల అనే సీరియస్ నాటకం, రెండు జడల బేబీ, కళ్లద్దాల బాబ్జి అనే హాస్య నాటిక రాశారు. రకరకాల దర్శకుల దగ్గర పనిచేసి 1982లో మంచుపల్లకి సినిమాతో దర్శకుడైన వంశీ తను రాసిన మహల్లో కోకిల అనే నవలను సితార సినిమాగా తీసి దర్శకునిగా తనదైన స్టైల్ ని ప్రేక్షకులకు చూపించారు. కామెడీ సినిమా లేడీస్ టైలర్ తీస్తే అది 175 రోజులు ఆడింది. దాంతో వంశీ కి కామెడీ సినిమాలు తీసే దర్శకునిగా ముద్ర పడింది. 1982లో జోకర్ సినిమాతో సంగీత దర్శకుడిగా కూడా మారి వరుసగా నాలుగు సినిమాలకి మ్యూజిక్ చేశారు. అన్వేషణ, లేడీస్ టైలర్, శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్, ఏప్రిల్ 1 విడుదల, అవును వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు, గోపి గోపిక గోదావరి... ఇలాంటి సినిమాలు ప్రేక్షక జనాదరణ పొందాయి. వంశీ రాసిన నవలల్లో ఉత్తమమైన నవల మహల్లో కోకిల. మా పసలపూడి కథలు, మా దిగువ గోదావరి కథలు ఎంతో పాపులర్ అయ్యాయి.అవి ఆయన్ని పాపులర్ రైటర్ని చేశాయి. మన్యంరాణి, గాలి కొండాపురం రైల్వే గేట్, గోకులంలో రాధ, రవ్వలకొండ, రంగులరాట్నం నవలలు... ఆకుపచ్చని జ్ఞాపకం కథలు, వంశీకి నచ్చిన కథలు, నల్లమిల్లి వారి పాలెం కథలు, ఈ మధ్యనే వచ్చిన పొలమారిన జ్ఞాపకాలు గోదావరి జిల్లాల విశేషాల్ని తెలియజేయడమే కాకుండా గోదావరి జిల్లాల భాషలోని అందాన్ని కూడా ప్రదర్శించాయి. వంశీకి బాగా నచ్చిన రచయితలు లత, బుచ్చిబాబు, ఆర్.ఎస్.సుదర్శనం, ముళ్ళపూడి వెంకటరమణ.నచ్చిన గొప్ప వ్యక్తులు బాపు-రమణలు. ఇప్పటివరకు తీసిన సినిమాలు 26 సరదాగా కాసేపు సినిమాలో రెండు పాటలు పాడి గాయకుడు కూడా అయ్యారు. ఏది చేసినా మనసుతో చేయటం ఆయనకున్న గొప్ప లక్షణం. మరిన్ని కథలను, జ్ఞాపకాలను తెలుగు పాఠకలోకానికి అందించాలని ఆశిస్తూ వారికి నన్నయ వాణి అక్షరాభినందనలను అందిస్తోంది.

## ఘోర కలి



*ఈ దేశంలో*
*తిండిలేనివాళ్ళే కాదు*
*గిన్నెలు లేనివాళ్ళు కోకొల్లలు!*
*దరిద్రం పట్టిపీడిస్తున్నప్పుడు*
*ధర్మం నాలుగుపాదాలపై ఏమికర్మ*
*నలబై పాదాలపై నడుస్తుంది!*
*నాలుగు మెతుకులు నోటికెళ్ళనివాడు*
*అన్యాయాలను ఎలా ఎదిరిస్తాడు?*
*ఓటును అమ్ముకున్నప్పుడే*
*ఓటరు విలువ పడిపోయింది!*

*ఇలాంటి ఘోరాలు ఎన్ని చూడాలో!*
*ఇలాంటి నేరాలు ఇంకెన్ని వినాలో!*
*భవిష్యత్ స్పష్టంగానే కనిపిస్తోంది!*
*ఇప్పుడు గిన్నె లాక్కుపోయినోడు*
*రేపు అన్నం లాక్కుపోడనే గ్యారెంటీ లేదు!*
*తట్టుకునే ధైర్యం ఉందా?!*

- డా.గూటం స్వామి, రాజమహేంద్రవరం.

## భయపడుతున్నా!

ఆస్తినంతా కట్టబెట్టలేదని కన్న తండ్రిని
కడతేర్చే కసాయి కొడుకు...
కని పెంచిన తల్లికి కరోనా సోకిందని
తోటివారు వారిస్తున్నా
కడదాకా కనుపాపై చూసుకున్న కూతురు...
చెట్టంత మనిషికి కరోనా సోకిందని
చెత్త దగ్గర వదిలేసేవారు కొందరు..
ఆక్సిజన్ సిలిండర్లను
ఆక్షన్లో పెట్టే వారు కొందరు...
చివరిదాకా చూసుకోలేక పోయానని
చితిలోకి దూకిన వారు కొందరు...
ఆస్తుల కోసం
ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారు కొందరు....
మందులు, పడకలు, అంత్యక్రియలకు
ప్యాకేజీ ఇచ్చే వారు కొందరు...
భోజనం, వసతి కల్పించి రోగులకు
సేవ చేస్తామని కొందరు...
క్లిష్ట సమయంలో కూడా
దొరికినంత దోచుకొనే వారు కొందరు...
కరోనా సమయంలో ప్రాణాలకు సైతం
పణంగా పెట్టే వారు కొందరు..
భయపడుతున్నా...భిన్న మనస్తత్వాలకు, మనిషిలోని
భావోద్వేగాలకు, మానవ సంబంధాలకు!!??
అవును..
ఈ కష్టం కారోనాను జయించటం కన్నా పెద్దది.

- భావన

## కవితా కాలం

### పరమపద సోపానం

జగతియందుజూడ జనులజీవితంబు,
పరికించిచూడగా పరమపదసోపానంబె,
కష్టసుఖములన్ని కలగూరగంపయే,
కఠినకాలమందు కాటువేయు వేళ!!

ఓర్పునేర్పులతోడ గెలవాలి ధీరవై,
సజ్జన సాంగత్యం, సద్గ్రంథ పఠనం,
నీతి నియమాలు నిచ్చెనల్ సద్గతికి,
మోక్షసాధనములిలలోన ఆస్తికులకు

- తాళ్లపల్లి భాగ్యలక్ష్మి

### చదువు


చదువ ననెడు వాని! మృదు రీతి చదివింప,
మొద్దు వాడు! మంచి ముత్యమగును,
రాయి శిల్పి చేత! రంగడయ్యెను కదా!
చెలిమితోడ పలికె! శ్రీధరుండు!!

- డా.పాలపర్తి శ్రీధర్

### మంచి- చెడుల మర్మం!!

స్తోత్రాలు, పూజలు, నమాజులు,ప్రార్థనలు సద్దుమణిగాయి!
పొలికేకలు, దరువులు, గంతులు, ఒకరి మాట మరొకరి చెవిన
పడకుండా చేసే దుర్భర శబ్దాలు పటాపంచలయ్యాయి!
మూగబోయిన మైకులు మనుషుల్లో నెలకొల్పాయి ప్రశాంతత!
చక్కెర వ్యాధిగ్రస్తులు చక్కగా/ హృద్రోగులు ఉన్నారు హాయిగా!
రక్తపోటు రోగులు కోపావేశాలు తగ్గి,
రంజిల్లుతున్నారు రక్తి కలిగి!
గుండెల్ని గాబరా పెట్టే శబ్ద కాలుష్యం గుల్ల పడింది!
ఆరోగ్య సమస్యలు అంతరించి
స్వచ్ఛమైన జీవితం సందడించింది!
తీర్థయాత్రల ప్రయాస పోయి, ప్రమాదాలు పలాయనమై
ఖర్చు పొదుపులో జమ అయ్యి, సజావుగా జీవితం మారింది!
మంచి-చెడుల మర్మం తెలిసిందిగా!
ఇలా కొనసాగిస్తే జీవితం మేలే కదా మిత్రమా!

-మల్లెమొగ్గల గోపాలరావు




- బాణాల గాయత్రి

# అవగాహనతో ఆందోళనను జయించొచ్చు

## జి.ఎస్.ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు




నేషనల్ వెబినార్ లో కోవిడ్ సూచనలందిస్తున్న గన్నిభాస్కరరావు

**19.05.21 (మీడియాసెల్)**

కోవిడ్ పట్ల హేతుబద్ధమైన అవగాహన ఎంతో అవసరమని ఆందోళనలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అవగాహనతో ఆత్మస్థైర్యంతో కోవిడ్‌ను ఎదుర్కొవాలని జి.ఎస్.ఎల్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్, సర్జన్, ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. విశ్వవిద్యాలయం బుధవారం "కోవిడ్ 19 చికిత్స మరియు సందేహాలు నివృత్తి" అనే అంశంపై నేషనల్ వెబినార్‌ను నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మీడియా సెల్ మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా తెలుగుశాఖ అధ్యాపకులు డా. తలారి వాసు, పి.ఆర్.ఓ పువ్వల ఆనంద్ వ్యవహరించారు. సభాధ్యక్షులుగా రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు ప్రస్తుత పరిస్థితులకు తగినట్టుగా విశ్వవిద్యాలయం మీడియా సెల్ చక్కని వెబినార్ నిర్వహించిందని అన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆందోళన పరిస్థితుల్లో యూనివర్సిటీ సైకలాజికల్ కౌన్సిలింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోవిడ్ కాలంలో వైద్యులు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కీలకోపన్యాసకులుగా డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ హాస్పటల్‌లో కోవిడ్ పేషెంట్లుకు అందుతున్న చికిత్స విధివిధానాలను వివరించారు. కోవిడ్ పేషెంట్లుకు ఆక్సిజన్ అవసరత, ఆక్సిజన్ ఏయే రూపాలలో అందుతుందని తదితర అంశాలను తెలియజేసారు. కోవిడ్ కాలంలో సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయని వాటిని ప్రజలు నమ్మవద్దని ఆందోళన చెందవద్దని చెప్పారు. మూడవ దశలో కూడా కోవిడ్‌ను ఎదుర్కొనగలిగే ఆత్మస్థైర్యాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. తరువాత రాజమహేంద్రవరం ఐ.ఎం.ఏ అధ్యక్షులు డాక్టర్ ఎన్.ఎస్.రామరాజు ప్రస్తుత కోవిడ్ పరిస్థితులు, ప్రజల ఆలోచన విధానాలు, మాస్క్ ధరించడం వంటి అంశాలపై అవగాహనను కల్పించారు. హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలు కోవిడ్ నుండి బయటపడే మార్గాలు వంటి అంశాలపై రాజమండ్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ చంద్రశేఖర్ తెలియజేసారు. బ్లాక్ ఫంగస్ నేపధ్యం దాని ప్రభావం మరియు కోవిడ్ సోకిన డయాబెటిక్ పేషెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలపై ప్రముఖ డయాబెటిక్ వైద్యులు డాక్టర్ కందుల సాయి సూచనలను అందించారు. అనంతరం కోవిడ్, వ్యాక్సినేషన్, ఆక్సిజన్, షుగర్ మరియు హోమ్ ఐసోలేషన్ వంటి అంశాలపై వీక్షకులు అడిగిన ప్రశ్నలకు వైద్యులు సమాధానాలను, సూచనలను తెలియజేసారు. ఈ జాతీయ సదస్సును జూమ్ యాప్ మరియు "నన్నయ న్యూస్ టీవీ" ద్వారా ప్రసారం చేసారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు డా.తలారివాసు, పి.ఆర్.వో ఆనంద్, గైనకాలజిస్ట్ డాక్టర్ వి. బిందుశ్రీదేవి, విజయభారతి, చెస్ట్ ఇనిస్టిట్యూట్ సి.ఈ.ఓ. గూడూరి రాధిక మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యామరణం!



మనం తినే ఆహారంతో పాటు పీల్చే గాలి, తాగే నీరు కలుషితమైపోయాయి. మన చుట్టూ విషం అనేక రూపాలలో వ్యాపించి మనల్ని కబళించడానికి ప్రయత్నిస్తోంది. పంచభూతాలు కలుషితం కావడంతో ప్రకృతి తన సహజ సౌందర్యాన్ని కోల్పోయి విలపిస్తుంది. ఈ విషయాన్ని పట్టించుకోకపోతే ఈ భూగోళం మనకు నివాసయోగ్యమే కాదు. మన సౌరమండలంలో ప్రాణికోటి జీవనం కొనసాగించడానికి అనువైన వాతావరణాన్ని కలిగి ఉన్నది భూగోళం మాత్రమే. ఇప్పుడు ఈ భూగోళాన్ని కూడా కలుషితం చేస్తున్నాం. భూగోళం చుట్టూ ఉన్న వాతావరణం జల వాయువులు, జడ చేతనా ప్రాణికోటి భూమిపైనా, లోపల అంతా కలిపితే పర్యావరణం అవుతుంది.పర్యావరణం అంటే ప్రకృతిలోని క్రమం ఆధారంగా సమన్వయంతో కొనసాగుతూ ఉండటం. మానవుని మనోవికాసం పర్యావరణ ఫల స్వరూపమే. అయితే మానవుడు మాత్రం తన బుద్ధిని వక్రమార్గంలో ఉపయోగిస్తూ కొన్ని లక్షల సంవత్సరాల నాటి పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నాడు. స్వార్థం పరాకాష్టకు చేరడంతో ప్రకృతిని దోపిడీ చేయడం పెరిగింది. దీని కారణంగానే పర్యావరణ విలువలు పతనమయ్యాయి. పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిరియంత్రం, విద్యుత్ శక్తి మొదలైన శక్తిని ఉత్పత్తి చేసే సాధనాల కారణంగా, సౌకర్యాల సంగతిఎలా ఉన్నా పర్యావరణ కాలుష్యం మాత్రం పెరిగింది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటివి పెరుగుతున్నాయి. అణుధార్మిక పదార్థాలు పెరిగాయి. వాతావరణంలో అనేక కలుషిత పదార్థాలు చేరాయి. అందువలన భౌగోళిక పరిస్థితులు మానవుడు పొందిన లాభాలతో, సంపాదించుకున్న సౌకర్యాలతో తృప్తిని పొందలేక మరింత దోపిడీ ప్రారంభించాడు. దాని ఫలితం మరింత కాలుష్యం. గత 30 సంవత్సరాలుగా మానవుడి దురాగతాలు పెరిగాయి. వాటి ఫలితంగా సహజ వనరులు తగ్గటం, కాలుష్యం పెరగటం మనకు కనబడుతుంది. ఇది ఇలాగే కొనసాగితే పర్యావరణం కాలుష్య భరితమై మానవ జాతి మనుగడే ప్రమాదంలో పడవచ్చు. దీనికంతటికీ కారణం ఒకటే.... సృష్టిలో మానవుడు ఒక భాగం మాత్రమే అని భావించి యావత్ సృష్టిని పరిగణనలోనికి తీసుకుని సమగ్రమైన దృక్పథంతో ఆలోచిస్తేనే సమస్య పరిష్కరించబడుతుంది. మనిషి తనలో ఉన్న అత్యాసను తొలగించుకోవాలి. అందుకోసం ఆలోచనా విధానం మారాలి. ఆనందం వస్తువులో లేదని మనస్సులోనే ఉందని గ్రహించాలి.వస్తుగతమైన ఆనందం తాత్కాలికమైనది. ఒక్కొక్కసారి అదే వస్తువు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. మానసిక స్థితి పై ఆధారపడి ఆనందం కలుగుతుందన్న విషయం మానవజాతికి అర్థం కావాలి.అప్పుడు విలాస జీవన ప్రభావం తగ్గుతుంది. దాని కారణంగా ప్రకృతిని దోచుకోవడం తగ్గుతుంది. పర్యావరణం పట్ల మనిషి దృక్పథంలో మార్పు వస్తుంది. పెర్మోంట్ కు చెందిన ప్రాకృతిక వాది జార్జ్ పెర్కిన్స్ మార్ష్... మనిషి – ప్రకృతి అనే గ్రంథాన్ని రచించాడు. ఆ పుస్తకంలో ప్రకృతి మొత్తాన్ని విశ్లేషించిన తర్వాత ఇలా ముగించాడు "మనిషి ఎక్కడున్నా విచ్ఛిన్నకర శక్తి. మానవుడు ఎక్కడ అడుగుపెడతాడో అక్కడ ప్రకృతిలోని సమతౌల్యం విపరీతంగా దెబ్బతింటుంది. భూమిపైనున్న అన్ని సంక్లిష్ట జీవుల్లోనూ మనిషి అత్యధికంగా విధ్వంసకుడు. ప్రకృతిని శక్తిహీనం చేస్తూ తాను శక్తివంతుడు అవుతున్నాడు." ఇది ఆయన ఇచ్చిన స్టేట్మెంట్.

మనం పర్యావరణం పర్యామరణం కాకుండా కాపాడుకునే ప్రయత్నం చేద్దాం.

– డాక్టర్ డి.శ్రీధర్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఆక్వాకల్చర్. ANUR.

## ఆహ్వానం



వచ్చే సంచికకు పర్యావరణ విషయాలపై చిత్రలేఖనం, మినీ కవితలు, కార్టూన్స్, సంక్షిప్త వ్యాసాలు పంపించండి.

– సంపాదక మండలి, నన్నయవాణి.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in